

విద్యార్థులుకాని, అధ్యాపక బృందంగాని, రోశయ్యగారంటే
అపార గౌరవాన్ని కల్గిఉన్నారంటే వారిలోని శీలసంపద, ఉన్నతాశయాలు,
ఉన్నత ప్రమాణాలు, ఉపజ్ఞ, ఉచితజ్ఞత, విశ్లేషణ, విద్వత్తు,
విశాల దృక్పథం, వీక్షించేగదా...

# రోచిష్ణువు రోశయ్యగారు


శ్రీ గొరిజవోలు పాండురంగారావు

నాగార్జున ఎడ్యుకేషనల్ సొసైటీ, గుంటూరు


శ్రీ ఎలవర్తి రోశయ్యగారు అధ్యాపక గురువు కాకపోయినా వారితో సన్నిహిత సంబంధము కలవాడినయినందున, నన్నీవ్యాసరచనకుపక్రమింప జేసినదా పరిచయం.

రోశయ్యగారిని గూర్చి విద్వత్కవి శ్రీ చిన్నము రామయ్యగారు సంభావిస్తూ

''ఆదర్శ వంతమౌ నధ్యాపకత్వమ్ము
నీ చిత్త శుద్ధి పండిన ఫలమ్ము
ఉభయ భాషా స్ఫుర దున్నత వైదగ్ధి
నీదు సాహిత్యంపు నిగ్గు జగ్గు'' అనే సీసపద్యపు వాక్యాలు, మరోతేటగీతి పద్యంలో...

''కుప్పుస్వామి కళాశాల కులపతివయినా
ఆధిపత్యములో నధృష్యత రహింప
ఏలినాడవు క్రమశిక్షకిరవుగాగ
నీకు దీర్ఘాయురస్తు నిర్నిద్రహృదయ'' అంటూ

వారి నాశీర్వదించిన తీరు నన్నాకట్టుకొనినది. రోశయ్యగారి గుణౌన్నత్యము, ఉభయభాషాపాండితీ పటిమ, మెళకువల తీరు, చెప్పకయే చెప్పబడినది. సాహిత్య విశారదులుగా, పండిత ప్రకాండునిగా పేర్వడసిన రోశయ్యగారు కుప్పుస్వామి కళాశాల కులపతిగా, పరిపాలనాదక్షునిగా, నిర్వహణా నైపుణిగా అందరి మన్ననలు పొందారు. కళాశాలలో క్రమశిక్షణా సాధనకు, ఉన్నత ప్రమాణాల వికాసానికి దృఢమైన పునాదులు వేసి ఎలా చరితార్థులయ్యారో మనందరి కనుభవైకవేద్యమే;

గాంధీ మహాత్ముడు నుడివినట్లు ''తన కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వర్తించే వ్యక్తికి వాటంతటవే హక్కులు సంక్రమిస్తాయి'' అనే నానుడి రోశయ్యగారి విషయంలో నూటికి నూరుపాళ్లు రుజువైంది. జే.కే.సి. పాలకవర్గం, అధ్యాపకవర్గం, విద్యార్థులు, రోశయ్యగారి పరిపాలనాదక్షతను, దూరదర్శిత్వాన్ని, అంకిత భావాన్ని శీలసంప్రదాయాలను, ఏకోన్ముఖంగా ఆమోదించారంటే వారి నైష్ఠికతకు, ప్రామాణ్యతకు వేరే నిదర్శనము లవసరములేదు.

## రోశయ్యగారితో పరిచయం

1959లో నేను కామర్సు విద్యార్థిగా హిందూకాలేజిలో చదువుతూ, ఇంగ్లీషు లిటరేచర్ చదివే మిత్రులతో కలిసి వారి వద్దకు వెళ్తూ యుండేవాడిని. ఆ సమయంలో ''పారడైజు లాస్ట్'' ''పారడైజ్ రిగెయిన్డ్'', అప్పుడప్పుడు షేక్స్పియర్ డ్రామాలు, ముచ్చటించేవారు. అలా తఱచుగా వారి వద్దకు వెళ్ళినప్పటినుండి సాహిత్యాభిరుచిపెరిగింది. మా జే.కే.సి. కళాశాల స్థాపననాటి నుండి ఇంకా సన్నిహితత్వం చోటుచేసుకున్నది. ఒక సన్నివేశములో రోశయ్యగారితో మాట్లాడుతూ ''మిల్టనుగారి సంపూర్ణ గోళవిజ్ఞానం, నక్షత్ర మండలాన్ని వర్ణించిన తీరు''ను ముచ్చటించి, మెచ్చుకొనగా, ఆ విషయాన్ని మరీ, మరీ ఏకరువు పెడుతూ ''పాండూ; నీ ఆసక్తి నాకచ్చెరువు కల్గించినదయ్యా''

అంటూ, ముచ్చటపడుతూ చేతిలో చాక్లెట్లుదిమిన తీరు నాకిప్పటికీ మరపురాని సంఘటనే. ఆర్ద్రహృదయంతో, శిష్య వాత్సల్యంతో, రసముప్పతిలునట్లుండే వారి బోధనా పద్ధతి నన్నెంతో ముప్పిరిగొనేట్లు చేసింది. వారితో సాహితీ సాన్నిహిత్యాన్ని, స్నేహబంధాన్ని ధృఢతరం చేసింది. ఆ సందర్భాల్లోనే ''పాండూ; షేక్స్పియర్ సాహిత్య రచనా వైశాల్య మెక్కువైనా- మిల్టనుగారి భావౌన్నత్యము, శీల సంపద శిఖరాయమానం గదా'' అని అంటూండేవారు.

## సాహితీ సమాలోచనం

రోశయ్యగారి దగ్గర ఆంగ్ల సాహిత్యమంతా ఎక్కువగా వెరిటీ ఎడిషన్లుండేవి. వేరేవారి ఎడిషన్లు కూడా తక్కువేమీగాదు. అంతే కాకుండా ఒక్కొక్క పుస్తకం అనేక ప్రతులుండెడివి. చదువులో శ్రద్ధగా నుండేవారికి మెళకువలనుగ్గడిస్తూ, చదవటానికి విద్యార్థుల దగ్గర ప్రతులు లేకపోతే వారికిస్తూ ఉండేవారు. విద్యార్థుల సందేహ నివృత్తి చేయడానికి వారికి అభిరుచి ఉంటే, శెలవైతే ఎన్ని గంటలైనా వారికోసము వినియోగించేవారు. తానే గురువు పాత్ర, తండ్రిపాత్ర, నీతి బోధకుని పాత్ర వహించేవారు. వారితో సాహితీ సమాలోచనమంటే పండుగ భోజనంలాటిదే. ఆంగ్ల పత్రికల్లో ప్రచురించబడిన ఫ్రాంక్ మొరే, పోతన్ జోసెఫ్ వ్యాసాలు, స్వరాజ్యలో వ్రాయబడిన రాజాజీ వ్యాసాలు, సంతానం, మరియాసామి, మసానీ రచనలు గూర్చి వారి దగ్గర ప్రస్తావన వస్తే ఎంతగానో సంతోషించేవారు. సమయోచితంగా విమర్శలెల్లా ఉండాలి అనే విధానాన్ని డ్రైడెన్, మకాలేల వ్రాతలభివర్ణించి, కొన్ని సందార్భాలలో తెలుగు విమర్శకుదాహరణగా పానుగంటి వారి ''సాక్షి'' సంపుటాల సమాచారాన్ని చదివి వినిపించేవారు, చదివించేవారు. భారతాది గ్రంథాలను, నన్నయ, తిక్కన, ఎఱ్ఱాప్రెగడల మహోన్నత రచనా సాంప్రదాయ రీతులను, వేర్వేరు పద్యాల వైశిష్ట్యాన్ని మైమఱచి విశ్లేషిస్తూ పోయేవారు. ఆలాంటి సాహితీవేత్త, కళాశాల కులపతిగా దొరకడం అరుదేమో?

ఇక చిన్నయసూరిగారి మిత్రలాభాన్ని, మిత్రభేదాన్ని, సంధి, విగ్రహాలను చదువుతూ, వారి తేట తెనుగుతనాన్ని, బోధనా పద్ధతులను ఎంత శ్లాఘించేవారో చెప్పనలవికాదు. ఇక వ్యాకరణం విషయానికొస్తే బాల వ్యాకరణము గూర్చి వారికున్న అభినివేశము, చొరవ, పట్టు చెప్పతరమా!! అదే వరుసలో దువ్వూరి వెంకటరమణశాస్త్రిగారు రచించిన ''రమణీయం'' (వ్యాకరణం) ను ఎంతగానో మెచ్చుకొనేవారు. అనేక ఉదాహరణలను అప్పటికప్పుడే పుస్తకం తీసుకువచ్చి వ్యావహారికంగా వ్యాకరణాన్ని అందరికందుబాటులోకి తేవడానికి చిలకపలికినట్లుగా తయారు చేశారయ్యా, అంటూ కాలాన్ని మరచి, ఆకలినికూడా లెక్కచేసే వారు కాదు. వారి సాహితీపిపాస, వైదుష్యం ఉభయ భాషల్లోనూ అనంతమైనవి.

## సమీక్ష, సద్విమర్శలు, వివిధ గ్రంథ పరిచయం

ఆవుల గోపాలకృష్ణమూర్తిగారి లాంటి మహామేధావి, విమర్శకుడు వారి విమర్శకు, సమీక్షకు ఎక్కువగా విలువ నిచ్చేవారు. అందుకే కాబోలు భగవద్గీతామృతము వ్రాసిన కళాప్రపూర్ణ త్రిపురాన వేంకట సూర్య ప్రసాదరావు దొరవారు తన శిష్యతముడగు రోశయ్యగారిచేత, గోపాలకృష్ణమూర్తిగారిచేత గ్రంథానికి పరిచయం వ్రాయించారు. రోశయ్యగారి మేధ, సార్వజనీన సాహితీ దృక్పథం, విమర్శనా పటిమ, బుధామోదమగు రీతిలో సద్విమర్శనా పూర్వకమగు పరిచయ వాక్యాలు వ్రాయగల ధిషణ, విశ్లేషణ వారి దగ్గర ఉన్నాయనే గదా వారిచేత వ్రాయించారు.

కొత్త భావయ్య చౌదరిగారు వ్రాసిన ''కమ్మవారి చరిత్ర'' గ్రంథానికి రోశయ్యగారిచేత పీఠిక వ్రాయించారు. ఆ పీఠిక వారి సమగ్ర చారిత్రక అవగాహనకు అద్దం పట్టింది. వివిధ విషయాల్లో వారికున్న సమగ్ర పాండిత్యం, అవగాహన అందరినీ ఆశ్చర్య చకితుల్ని చేస్తుంది.. యం.యన్.రాయ్ వంటి మేధావుల్తో వారికి సన్నిహిత సంబంధముండేదట. వసుధావారు రాయిష్టు, నవ్యమానవతావాది.

తరువాత స్వతంత్ర స్పార్టీ భావాలు వారికి నచ్చాయి. ఆస్తికులైనా, హేతువాద దృక్పథం కల్గినవారు. ''కృషితోన్నాస్తి దుర్భిక్షం'' అనే దానిలో సంపూర్ణ విశ్వాసం కలవారు. వారికి యోగశాస్త్రంలోకూడా పరిచయముంది. జీవిత ప్రథమాంకంలో రాజయోగం, పతంజలి యోగశాస్త్రం, సీతారామాంజనేయ సంవాదంలాంటి గ్రంథాల పరిచయమేర్పరచు కున్నారు. ఒకసారి నేను ''అమనస్కయోగాన్ని'' గురించి చర్చించగా వారు ''సీతారామాంజనేయ సంవాదం'', రచయిత పరసురామ పంతుల లింగమూర్తి అయ్యవారు కదా అంటూ ఆ గ్రంథాన్ని బయటకు తీసుకువచ్చారు. చాలాసేపు చర్చించారు. సాహిత్యం, చరిత్ర, విమర్శ, ఒకటేమిటి అనేక విషయాల్లో వారికి సముద్ర మథనం చేసినంత అవగాహన, పాండిత్యం ఉన్నాయి. వెనుకటి ''లియోనార్డో డావిన్సీ'' లాంటివారే! వారిని ''వాకింగ్ ఎన్సైక్లోపేడియా'' అంటే తప్పు గాదేమో!! వారికి కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరిగారి ''సూతపురాణం'', ''ఖూనీ'' గ్రంథాలు మహా ప్రియమైనవి. కవిరాజుగారి మహోన్నత వ్యక్తిత్వాన్ని, సాహిత్యాన్నెంతగానో శ్లాఘించేవారు.

## రోశయ్యగారి వ్యక్తిత్వం, శీల సంపద

వారు మొదట గుంటూరు ఎ.సి. కళాశాలలో అధ్యాపకత్వము నిర్వహించి, తదుపరి భీమవరం డి.ఎన్.ఆర్. కళాశాలలో పనిచేసి, మరల ఎ.సి. కాలేజీలో అనేక సంవత్సరాలు పనిచేసి తర్వాత జే.కే.సి. కళాశాలకు వచ్చారు. ఏ కాలేజీ వారైనా వారిని గూర్చి చెప్పిందొకటే, వారిది ఉన్నత వ్యక్తిత్వమని, శీలసంపద గలవారని, మాటపడరని, ఉద్యోగ నిర్వహణలో ఉత్తమ సాంప్రదాయాలు కలవారని, ఎదుటివారిలో గొప్పతనముంటే దాన్ని గౌరవించే వారని, ఉన్నత విలువలకు, శీలసంపదకు ప్రాధాన్యతనిచ్చేవారని, సర్వే సర్వత్రా వినబడ్డ మాట. అందుకే వేటూరివారి ''నీతినిధి'', చిన్నయసూరి ''నీతిచంద్రిక'' మిత్రలాభము, మిత్రభేదము, సంధి, విగ్రహము, అసంప్రేక్ష

కారకత్వము  ఇత్యాదులు ప్రియమైన గ్రంథాలు. ఆచరణలోకూడా ''ఆత్మగౌరవ'' సంఘాన్ని స్థాపించి అవిభక్త మద్రాసు రాష్ట్రాన్ని పాలించిన ''జస్టిస్ పార్టీ'' వ్యక్తులు వారికి నచ్చారు. త్యాగరాయశెట్టి, సుబ్బరాయన్, మునిస్వామి నాయుడులాంటి వారిని బహుధా ప్రశంసించేవారు. వారిలో ''డిసిప్లిన్, డ్యూటీ, డివోషన్, డెడికేషన్'' సమగ్రంగా తిష్ఠవేశాయి. వారు మా జే.కే.సి. కళాశాల కీర్తిని దశదిశలా వ్యాపింపచేశారంటే వారి క్రమశిక్షణ, కర్తవ్యపాలన, అంకితస్వభావము, అకుంఠిత దీక్ష, చొరవ, పరిపాలనా దక్షత, రాగద్వేషాల కతీతంగా ఉండే మనస్తత్వము, నియంత్రణ స్వభావములే కారణం. వారిని గూర్చి అధ్యాపక వర్గం, విద్యార్థులు, పాలకవర్గం అనుకొనే మాటల్లోనే వారి నిరాడంబరత, సౌజన్య సంపత్తి వ్యక్తమౌతుంటాయి. రోశయ్యగారిది విలక్షణ మనస్తత్వం.

అందరూ ఆయన పల్కు ''దారుణఖండల శస్త్రతుల్యం'' అని అనేవారు. అది సమయ సందర్భాలను బట్టే. వారిది కోమల రసార్ద్ర హృదయం. ఆ విషయం వారితో సాన్నిహిత్యం కల్గిన వారికి తెలుస్తుంది. వారు సంగీతమంటే చెవి కోసుకొనేవారు. పట్టమ్మాళ్, ఎం.ఎస్. సుబ్బులక్ష్మి, శ్రీరంగం గోపాలరత్నం, మహారాజపురం సంతానం, సెమ్మంగుడి శ్రీనివాస అయ్యర్ వారి కచేరీలు, రేడియో ప్రోగ్రాంలు వదిలిపెట్టేవారుకాదు. ద్వారం వెంకటస్వామి నాయుడుగారి ఫిడేలు వాద్యమంటే మక్కువ చూపేవారు. పని తొందరలో వినడం వీలుకాకపోతే ఎంతోబాధపడేవారు.

## విధి నిర్వహణ, పరిపాలనా విధానం, ఉన్నత విలువలపై ఆసక్తి, విద్యార్థుల అభ్యున్నతి

కాలేజీలో విద్యార్థులను చేర్చుకొనే సమయంలో ప్రథమ పీఠం ''మెరిట్''కే వేశారు. రాగద్వేషాలకు అతీతంగా వ్యవహరించేవారు. కళాశాల పురోభివృద్ధి, విద్యార్థుల అభ్యున్నతి దృష్టిలో ఉంచుకొని

నిరంతరం వ్యవహరించేవారు. సంయమనం పాటించేవారు. పాలకవర్గ సభ్యుల అభీష్టాన్ని, తలిదండ్రుల మనోభావాలను, విద్యార్థుల అభిరుచులను సమన్వయంచేసి, ఆచి, తూచి తత్కాలంగా ఎదురైన అవాంతర పరిస్థితులనధిగమించేవారు. కరవాలం ఝళిపించినా, కరుణను వెంటనే ప్రదర్శించేవారు. నిర్వహణలోపం కనిపిస్తే అరచి, కరిచినట్లుగా వ్యవహరించేవారు. దిద్దుబాటు జరిగిన తరువాత అక్కున చేర్చుకొని మాట్లాడేవారు.

పాలనా నిర్వహణలో పాలకవర్గం వారైనా, పండితులైనా, పారిషదులైనా, రాజీపడని ధోరణితో వ్యవహరించి, కాలేజీ ప్రతిష్ఠను ఇనుమడింపజేసి, విద్యార్థుల సమగ్రాభివృద్ధికి, అభ్యున్నతికి తోడ్పడేవారు. కసరుకున్నా, కఠినంగా వ్యవహరించినా ఉగ్రనరశింహుడుగా ఉలిక్కిపడేట్లు చేసినా, విద్యార్థులుకాని, అధ్యాపక బృందంగాని, రోశయ్యగారంటే అపార గౌరవాన్నికల్గి ఉన్నారంటే వారిలోని శీలసంపద, ఉన్నతాశయాలు, ఉన్నత ప్రమాణాలు, ఉపజ్ఞ, ఉచితజ్ఞత, విశ్లేషణ, విద్వత్తు, విశాల దృక్పథం, వీక్షించేగదా. అందుకేకదా డ్కాక్టరు సదాశివరావుగారు ప్రధానాచార్యులుగా వారిని కావాలని కోరుకున్నది. మేమంతాఆకాంక్ష వెలిబుచ్చింది. విద్యార్థుల అభ్యున్నతికి, సమగ్ర సమాచారమందించగోరి దివాకర్ల వేంకటావధాని, దువ్వూరి వేంకటరమణశాస్త్రిగారిలాంటి అనేకమంది మహోపాధ్యాయుల్ని పిలిపించి, కాలేజీ భాషాసమితి తరఫున ఆహ్వానించి ఉపన్యాసాలిప్పించేవారు. ఒకసారి దువ్వూరివారు వ్యాకరణంపై రెండు గంటలు ఉపన్యసించారు. విద్యార్థులు నిశ్శబ్దం పాటించి ఆసక్తిగా విన్నారు. విద్యార్థుల ఆసక్తి, క్రమశిక్షణలు చూచి, శాస్త్రిగారు అచ్చెరువందారు. రోశయ్యగారి కళాశాల నిర్వహణ తీరుతెన్నులను ఎంతగానో ప్రశంసించారు. అందుకే రోశయ్యగారి ఆధ్వర్యంలో మా జే.కే.సి. కళాశాల మూడు పువ్వులు, ఆరుకాయలుగా అభివృద్ధి చెందింది. అజరామర కీర్తి సంపాదించింది. ఆచార్య రంగాగారి గురుత్వం,

రోశయ్యగారి సాహితీ మార్గదర్శకత్వం నాలో సాహితీ పిపాసను, రచనా వ్యాసంగాన్ని పెంచి, పెంపొందించాయంటే అతిశయోక్తి కాదు.

## రోశయ్యగారి శాస్త్ర పాండిత్యం

ఆల్ ఇండియా రేడియోవారు రోశయ్యగారిచేత చిన్నయసూరి వ్యాకరణంపై ప్రసంగం చేయించి, రికార్డుచేసి ప్రసారం చేశారు. ఆ ప్రసంగాన్ని విన్నవారందరికి వ్యాకరణంపై రోశయ్యగారికున్న పట్టు, పాండిత్యం, పటిమ, పారదర్శకత విశదమైనాయి. అవి ఆనాటికీ ఈనాటికీ, జ్ఞానదీపికలే. ఒక్కమాటలో చెప్పాలంటే అమరేంద్రగారు చెప్పారు ''పరవస్తు చిన్నయసూరిగారు బ్రతికుండి రోశయ్యగారి ఉపన్యాసం వింటే ఎంతగానో ఆనందించేవార''న్నారు. రోశయ్యగారిని గూర్చి ఎంత చెప్పుకున్నా ఇంకా మిగిలే ఉంటుంది. అందుకే రోశయ్యగారు రోచిష్ణువు. వారికి నా నివాళి.



1988, అమెరికాలో